సాక్షి నల్లగొండ

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



ప్రమాద తీవ్రత తగ్గించేలా..
ప్రమాదం జరిగితే తీవ్రత తక్కువగా ఉండేలా సరికొత్త టెక్నాలజీతో కాంపోజిట్ సిలిండర్లు మార్కెట్‌లోకి వచ్చాయి. - 8లో



ప్రాతినిధ్యం పెరగాలి
న్యాయ వ్యవస్థలో అట్టడుగు వర్గాల ప్రాతినిధ్యం పెరగాలని సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీశంకర్ అన్నారు. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 42° / 24°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-38 (సోమవారం సాయంత్రం)
సహర్ 4-33 (మంగళవారం ఉదయం)

ఆపదలో అమ్మ

ఏటేటా తగ్గుతున్న బాలికల సంఖ్య
- పది మండలాల్లో పూర్తిగా పడిపోయిన నిష్పత్తి
- స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలే కారణం
- ఆందోళన కలిగిస్తున్న అబార్షన్లు



నల్లగొండ టౌన్ : జిల్లాలో బాలికల నిష్పత్తి రోజురోజుకూ పడిపోతోంది. 2011 గణాంకాల ప్రకారం జిల్లాలో 0 నుంచి 6 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన ప్రతి వెయ్యి మంది బాలురకు 895 మంది బాలికలు ఉన్నారు. ముఖ్యంగా జిల్లాలోని చందంపేట, మునుగోడు, పెద్దవూర, త్రిపురారం, మర్రిగూడ, చిట్యాల, చండూరు, పీఏపల్లి, నార్కట్‌పల్లి, చింతపల్లి, మిర్యాలగూడ, మండలాల్లో ఆడపిల్లల నిష్పత్తి గణనీయంగా పడిపోయింది. ఆశ్చర్యం కలిగించే అంశం ఏమిటంటే నడి వయస్కు స్త్రీల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. కానీ 0–6 సంవత్సరాల బాలికల సంఖ్య మాత్రమే రోజురోజుకు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. 20 సంవత్సరాలుగా బాలికల నిష్పత్తి పడిపోవడంతో జిల్లాలో మగ పిల్లలకు వివాహాలు చేసుకోవడానికి ఆడపిల్లలు దొరకని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం 30 నుంచి 35 సంవత్సరాలు వచ్చినా వివాహాలు కాక అనేక మంది యువకులు అవివాహితులుగా మిగిలిపోతున్నారు.

బాలికల సంఖ్య గణనీయంగా తగ్గిన మండలాలు..

2011 గణాంకాల ప్రకారం ప్రతి 1000 మంది బాలురకు బాలికల సంఖ్య (0–6సంవత్సరాలు)

మండలం	బాలికల సంఖ్య		
చందంపేట	834	చిట్యాల	883
మునుగోడు	842	చండూరు	894
పెద్దవూర	850	పీఏపల్లి	902
త్రిపురారం	853	నార్కట్‌పల్లి	903
మర్రిగూడ	863	చింతపల్లి	906

గర్భంలోనే అంతమొందిస్తున్నారు..
ఆడపిల్ల అని తేలితే గర్భంలోనే అంతమొందిస్తున్నారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై జిల్లా యంత్రాంగం నిఘాను ఏర్పాటు చేసినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కొందరు మొబైల్ స్కానింగ్ సెంటర్లను నిర్వహిస్తూ జిల్లా వ్యాప్తంగా పర్యటించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రతి గర్భిణికి లింగనిర్ధారణ పరీక్షలను నిర్వహించి డబ్బులను దండుకోవడంతో పాటు ఆడా, మగా అనే విషయాన్ని కూడా తెలియజేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆడపిల్ల అని తేలితే వెంటనే అబార్షన్లను చేయించి కడుపులోనే పిండాన్ని అంతమొందిస్తున్నారు. జిల్లాలోని కొందరు మహిళా వైద్యులే ఇలాంటి దందాను కొనసాగించడం విస్మయాన్ని కలిగిస్తోంది.

నాలుగేళ్లుగా జిల్లాలో జరిగిన కాన్పులు.. బాల బాలికల సంఖ్య

సంవత్సరం	కాన్పులసంఖ్య	బాలురు	బాలికలు
2019-20	20,792	10,808	9,984
2020-21	21,701	11,319	10,423
2021-22	23,357	12,282	11,075
2022-23	22,671	12,053	10,618

గ్రామీణుల అమాయకత్వం..
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్కానింగ్ సెంటర్లపై నిఘాను ఉంచినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా గర్భిణుల సంబంధికుల అనుమతి, ప్రోత్సాహంతోనే అబార్షన్లను చేస్తూ కొందరు వైద్యులు వేలాది రూపాయలను దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని కొన్ని స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రుల్లో ఇలాంటి దందాను ప్రధాన వృత్తిగా ఎంచుకున్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని గ్రామీణ వైద్యులను ఏజెంట్లుగా నియమించుకుని వారికి కమీషన్ల రూపంలో ఇస్తూ దందాను బాహాటంగా నిర్వహిస్తున్నాయి. ఒక్కో అబార్షన్‌కు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశాం. లింగనిర్ధారణ పరీక్షలను నిర్వహించినా.. అబార్షన్లు చేసినా.. అందుకు ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అలాంటి స్కానింగ్ సెంటర్లను మూసివేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. జిల్లా వ్యాప్తంగా పీసీపీఎన్‌డీటీ యాక్టును పకడ్బందీగా అమలు చేస్తున్నాం. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న సెంటర్‌ల సమాచారం అందించాలి.
– డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

• సన్ డే

కట్టంగూర్‌లో 44.7 డిగ్రీలు



మధ్యాహ్నం సమయంలో నిర్మానుష్యంగా ఉన్న నల్లగొండలోని రామగిరి సెంటర్

- జిల్లాలో 40 డిగ్రీలపైన నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రత
- ఎండ తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలు
- ఇళ్ల నుంచి బయటికి రాని జనం

నల్లగొండ : జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆదివారం కట్టంగూర్ మండలంలో 44.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. 20 మండలాల్లో 40 డిగ్రీలపైనే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మిగిలిన మండలాల్లో 40 డిగ్రీల నుంచి 37 డిగ్రీల మధ్య లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 10వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆదివారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రతలతోపాటు కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా పెద్ద ఎత్తున పెరిగాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో గాలిలో తేమ శాతం తగ్గి కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా పెద్ద ఎత్తున నమోదయ్యాయి. దీంతో ఉష్ణతాపాన్ని తట్టుకోలేక జనాలు ఇబ్బందులు పడుతున్నారు.

అల్లాడుతున్న ప్రజలు
ఎండ తీవ్రతకు ఉదయం 9గంటల నుంచే వాతావరణం అంతా వేడిగా మరుతోంది. అవసరం ఉంటే తప్ప జనాలు బయటికి రావడం లేదు. అధిక ఉష్ణోగ్రత నమోదు అవుతుండడంతో ఇంట్లో ఉన్నప్పటికీ తట్టుకోని పరిస్థితి ఏర్పడుతోంది. ఏసీలు, కూలర్లు ఉపయోగిస్తుండడంతో విద్యుత్ వాడకం కూడా పెద్ద ఎత్తున పెరిగింది. ఉపాధి హామీ, ఇతర వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు ఎండలకు బెంబెలెత్తిపోతున్నారు. తప్పని పరిస్థితిలో బయటికి వస్తే తగు జాగ్రత్తలు పాటిస్తున్నారు. శీతల పానీయాలు, కొబ్బరి బొండాల నీరు సేవిస్తూ ఉపశమనం పొందుతున్నారు.



కొబ్బరి నీళ్లు సేవిస్తున్న మహిళ

వారంలో జిల్లాలో సగటు ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	గరిష్ట	కనిష్ట
10	39.5	21.4
11	40.0	22.0
12	40.5	22.4
13	40.8	22.8
14	41.0	23.0
15	40.0	23.2
16	40.5	24.0

ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా.. (డిగ్రీల సెల్సియస్‌లో)

మండలం	గ్రామం	గరిష్ట	కనిష్ట	మండలం	గ్రామం	గరిష్ట	కనిష్ట
కట్టంగూర్	కట్టంగూర్	44.7	32.0	నకిరేకల్	నకిరేకల్	41.3	34.3
నిడమనూర్	నిడమనూర్	43.1	32.6	హాలియా	హాలియా	41.2	33.7
దామరచర్ల	దామరచర్ల	43.1	34.5	త్రిపురారం	కామారెడ్డిగూడెం	41.2	32.3
తిప్పర్తి	పజ్జూర్	42.8	33.9	నాంపల్లి	నాంపల్లి	41.1	35.1
కేతేపల్లి	కేతేపల్లి	42.6	34.2	నార్కట్‌పల్లి	నార్కట్‌పల్లి	40.9	32.4
తిప్పర్తి	మామిడాల	42.32	35.1	దేవరకొండ	ముదిగొండ	40.7	34.6
నల్లగొండ	బస్టాండ్	42.2	33.2	మర్రిగూడ	శివన్నగూడెం	40.7	33.9
కట్టంగూర్	ఈదులూరు	42.1	32.2	చండూర్	చండూర్	40.5	33.0
చందంపేట	తెల్‌దేవర్‌పల్లి	41.9	33.6	కొండమల్లేపల్లి	కొండమల్లేపల్లి	40.5	35.3
కనగల్	కనగల్	41.7	32.8	చిట్యాల	ఉరుమడ్ల	40.4	32.1
చందంపేట	చందంపేట	41.7	33.7	మాడ్గులపల్లి	మాడ్గులపల్లి	40.4	32.6
నాంపల్లి	మేడ్లబావి	41.5	35.4	మునుగోడు	గూడపూర్	40.3	32.7
త్రిపురారం	మాటూరు	41.4	32.0	పెద్దవూర	చలకుర్తి	40.2	33.0
నల్లగొండ	కలెక్టరేట్	41.4	34.7	శాలిగౌరారం	శాలిగౌరారం	40.2	32.2
మిర్యాలగూడ	తీక్యాతండా	41.3	32.3	నేరడుగొమ్ము	నేరడుగొమ్ము	41.0	32.6
				వేములపల్లి	వేములపల్లి	40.1	32.3

న్యూస్‌రీల్

ఓపెన్ ఎయిర్ జైలు నిర్మాణానికి స్థల పరిశీలన



మ్యాప్ ద్వారా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దేవరకొండ(చందంపేట) : నేరేడుగొమ్ము మండల పరిధిలోని పెద్దమునిగల్ గ్రామ శివారులో నిర్మించ తలపెట్టిన ఓపెన్ ఎయిర్ జైలు నిర్మాణానికి ఆదివారం సంబంధిత జైళ్ల శాఖ అధికారులు స్థల పరిశీలన చేశారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎల్.దేవుల స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. పెద్దమునిగల్ గ్రామ శివారులోని 289 ఎకరాల్లో ఓపెన్ ఎయిర్ జైలు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. జైలు నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టనున్నట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ దేవుల వెల్లడించారు. అనంతరం రెవెన్యూ అధికారులను అడిగి స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను ఆయన సేకరించారు. వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. ఆయన వెంట నేరేడుగొమ్ము తహసీల్దార్ అరుణమ్మ, దేవరకొండ సబ్‌జైలు సూపరింటెండెంట్ హర్షవర్ధన్, ఎస్‌ఐ నరేష్, రెవెన్యూ అధికారులు తదితరులున్నారు.

నేడు సాగర్‌కు కేఆర్‌ఎంబీ చైర్మన్

నాగార్జునసాగర్ : కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) కమిటీ చైర్మన్ నందకుమార్, మెంబర్ అజయ్‌కుమార్ గుప్తా సోమవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, లోలెవల్ కెనాల్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల హెడ్ రెగ్యులేటర్లు, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం తదితర ప్రాంతాలను 17, 18 తేదీల్లో సందర్శించనున్నారు. 19వ తేదీన అధికారులతో కలిసి టెలిమెట్రి స్టేషన్స్ పాలేరు రిజర్వాయర్లను సందర్శించనున్నట్లు జిల్లా చీఫ్ ఇంజనీర్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

నిడమనూరు : ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆదివారం డిమాండ్ చేశారు. నిడమనూరులోని కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. రైతులు 18 రోజులుగా ధాన్యాన్ని కేంద్రాల్లో పోసి కాపలా ఉంటున్నారని.. ఎండలకు ధాన్యం ఆరిపోయి తూకం బాగా తగ్గే అవకాశం ఉందన్నారు. రైతుల వద్దనున్న మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, కోటేష్, ఆకారపు సురేష్, రమేష్, ఇంద్రారెడ్డి, పుల్లయ్య, రంగారెడ్డి, ప్రసాద్ తదితరులున్నారు.

నేటి నుంచి ఉచితంగా పాలిసెట్ కోచింగ్

రామగిరి(నల్లగొండ) : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నల్లగొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 17వ తేదీ నుంచి ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రాములు, కె.మధుసూదన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8142070502, 9032796669, 9666542153 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

విద్యారంగ అభివృద్ధికి చొరవ చూపాలి



పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిని సన్మానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ : విద్యారంగ అభివృద్ధికి పీఆర్‌టీయూ మరింత చొరవ చూపాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూచించారు. ఆదివారం సూర్యాపేటలో పీఆర్‌టీయూ నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతోపాటు నాయకులు మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యారంగంలో ముఖ్యమంత్రి తీసుకొచ్చిన మార్పులతోనే తెలంగాణ విద్య భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. విద్యావంతుల తయారీలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అనంతరం సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు ఫణికుమార్‌ను మంత్రి సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని, వెంటనే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేసి ఐఆర్‌ను ప్రకటించాలని, మోడల్ స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, నాయకులు జితేందర్‌రెడ్డి, తరాల జగదీష్, జ్యోతుల చంద్రశేఖర్, రామలింగారెడ్డి, శ్రీనివాస్, నర్సింహనాయక్, పరమేష్‌యాదవ్, అనిత, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

నల్లగొండ క్రైం : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరికీ కనీస అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఫైర్ స్టేషన్ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల్లో ప్రమాదాలు జరిగే తీరు ముందుగానే పసిగట్టే మెళకువలను ప్రమాదం జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు ప్ర ధాన స్విచ్ ఆఫ్ చేసిన తర్వాతనే మంటలను ఆ ర్పాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు 101కి ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రాంనర్సయ్య, శంకర్, జానిమియా, సురేష్, సధానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి
- డిండిలో సీపీఐ ప్రచార యాత్ర ప్రారంభం



జెండా ఊపి ప్రచార యాత్రను ప్రారంభిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి

డిండి : ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నిరంతర పోరాడుతుందని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. బీజేపీ కో హఠావో దేశ్ కో బచావో అనే పేరుతో సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు చేపట్టిన సీపీఐ ప్రచార యాత్రను డిండి మండల కేంద్రంలో ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నల్లగొండ జిల్లాలో ప్రారంభించిన డిండి లిఫ్ట్ పనులను పూర్తి చేసి దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద ఉన్న శ్రద్ధ డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే రిజర్వాయర్లపై ఎందుకు లేదని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేపట్టే ప్రజా వ్యతిరేక విధానాలతోపాటు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయని హామీలను ప్రజలకు తెలియజేసేందుకే సీపీఐ ప్రచార యాత్రను ప్రారంభించామన్నారు. అదానీ, అంబానీలను కుబేరులుగా తయారు చేసేందుకే లాభాల్లో ఉన్న కొన్ని బ్యాంకులను దివాలా తీసిన బ్యాంకుల్లో విలీనం చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కిందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీయేతర ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలకు సీపీఐ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, ఉజ్జిని యాదగిరిరావు, రత్నాకర్‌రావు, పల్లా నర్సింహారెడ్డి, పల్లె నర్సింహ, అంజయ్యనాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, మైనోద్దీన్, బుచ్చిరెడ్డి, కనకాచారి, బొల్లే శైలేష్, రామస్వామి, వెంకటేశ్వర్లు, నవీన్, సలీం, సాగర్, గోవర్ధన్, చక్రీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



బండావత్‌తండాలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

మిర్యాలగూడ : నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసి పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం దామరచర్ల మండలంలోని బండావత్‌తండా, సొంగతండా, బాలాజీనగర్‌తండా, నేమ్యాతండా గ్రామాల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కుంభకోణాలు చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మట్టారెడ్డి, బాలాజీనాయక్, హతీరాం, నెహ్రూ, నాగు, భీమానాయక్, శ్యామ్, గోపాల్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

నల్లగొండ టౌన్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం గత దశాబ్ద కాలంగా పోరాడుతున్నామని చెప్పారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయని పక్షంలో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. కార్యక్రమలో సంఘం జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు, కోశాధికారి అందుగుల విజయ్, పంకజ్‌రెడ్డి, నల్లమేకల వెంకయ్య, కొరివి కృష్ణ, శ్రీనివాస్, కాలం నారాయణరెడ్డి, వెంకటేశం, సుంకరి భిక్షంగౌడ్, కొప్పుల రాంబాబు, గణపురం భీమ య్య, భూతం ఆయకమల్లు, తరాల జగదీష్, సోమయ్య, సాయిబాబా పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య పదసుమార్చన

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీ అన్నమాచార్య సంకీర్తన ప్రచార సమితి నల్లగొండ, అన్నమయ్య కళా సమితి నకిరేకల్ ఆధ్వర్యంలో అన్నమయ్య పదసుమార్చన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు కృష్ణంరాజు సాయి శ్రేష్ఠ, పుల్లభట్ల సంహితల సంకీర్తనలు ఆలపించిన కీర్తనలు శ్రోతలను అలరించాయి. ఎం.లక్ష్మీనారాయణ, జయప్రకాష్ వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.పురుషోత్తమచార్యులు, గండెపల్లి సుమలత, డాక్టర్ సీహెచ్.మల్లికార్జునచారి తదితరులు పాల్గొన్నారు.



అన్నమాచార్య సంకీర్తనలు చేస్తున్న గాయకులు

యాదాద్రీశుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలోని ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పుష్పాలతో పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య కైంకర్యాలు చేపట్టారు. వేకువజామున సుప్రభాతం, ఆరాధన, అర్చనలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, గజవాహనసేవ, బ్రహ్మోత్సవం, వెండిజోడు సేవలు వైభవంగా నిర్వహించారు.

ఘనంగా అఖండనామ సంకీర్తన
యాదగిరిగుట్ట : పట్టణంలోని శుభోదయ గార్డెన్స్‌లో అఖండ నామాశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షయ సువర్ణ లక్ష్మీ నారాయణ మహా యజ్ఞంలో వైభవంగా కొనసాగుతోంది. ఆదివారం ఆశ్రమ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభుజీ ఆధ్వర్యంలో అఖండ నామ సంకీర్తన నిర్వహించారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన సంకీర్తన సోమవారం(నేడు) ఉదయం 8గంటల వరకు కొనసాగనుంది.



ఆలయ తిరువీధిలో బారులుదీరిన భక్తులు

ఇక 21వ రోజు మహా యజ్ఞంలో భాగంగా రాహు గాయత్రి హవనం శాస్త్రోక్తంగా చేపట్టారు. రాహు దోష నివారణ, దుర్గామాత అనుగ్రహం, శత్రుబాధ నివారణ, సర్వ విజయ ప్రాప్తి కోసం రాహు గాయత్రి హవనం నిర్వహించినట్లు కృష్ణదాస్ ప్రభూజీ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మాతా మధుమంజలీ, వీర దర్మేంద్రస్వామిజీ, గణేష్ ప్రభులతో పాటు వరంగల్, బచ్చన్నపేట, సూర్యాపేట, హైద్రాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన నామ సంకీర్తకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి : రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి పట్టణ శివారులో ఆదివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి–పగిడిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఎస్టీ హాస్టల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి గుర్తుతెలియని రైలు పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఎడమ ఛాతిపై ఐ లవ్ యూ పుష్ప అని పచ్చబొట్టుతో ఉన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దేవరకొండ (చందంపేట): అనుమతులు లేకుండా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని నేరేడుగొమ్ము పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవూర నుంచి ఆదివారం తెల్లవారుజామున నేరేడుగొమ్ము మండల పరిధిలోని పోలేపల్లి వైపునకు బొలెరో వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో మండల పరిధిలోని తిమ్మాపురం వద్ద వాహనాన్ని తనిఖీ చేసి 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు పేర్కొన్నారు.

బియ్యం వ్యాపారుల రిమాండ్

నాగార్జునసాగర్: ఆంధ్రా–తెలంగాణ సరిహద్దులో గల కొత్తబ్రిడ్జి మీదనుంచి తరలిస్తుండగా పోలీస్ చెక్‌పోస్టు వద్ద 9క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం రాత్రి సాగర్ పోలీసులు పట్టుకున్నారు. పలనాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన బియ్యం వ్యాపారులు నక్కబోయిన శ్రీనివాసరావు, ఓర్సుకోటేశ్వర్‌రావు, పిట్టల రవిశంకర్, కోటేశ్వర్‌రావు, బత్తులనాగరాజును అరెస్ట్ చేశారు. నింది తులపై కేసు నమోదు చేసి ఆదివారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

చెరువులో పడి బాలుడు మృతి

సూర్యాపేట క్రైం : చెరువులో పడి బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేటలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని మామిళ్లగడ్డకు చెందిన సుజాత కుమారుడు సాయితేజ(08) తమ్ముడు కళ్యాణ్‌శ్రీనివాస్‌తో కలిసి ట్యాంక్‌బండ్ సద్దుల చెరువు పైకి వచ్చారు. ఆడుకుంటూ సాయితేజ ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడ్డాడు. వెంటనే కళ్యాణ్‌శ్రీనివాస్ ఇంటికి వచ్చి తల్లికి సమాచారం అందజేశారు. చెరువు దగ్గరకు వెళ్లే సరికి అప్పటికే సాయితేజ మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాద తీవ్రత తగ్గించేలా..

- మార్కెట్‌లో కాంపోజిట్ సిలిండర్లు
- 5నుంచి 10 కేజీల చొప్పున అందుబాటులో..
- ప్రమాద తీవ్రత 80 నుంచి 90శాతం తక్కువగా ఉండేలా రూపకల్పన

కోదాడ: అనుకోని సంఘటనలో గ్యాస్ సిలిండర్ పేలితే జరిగే విధ్వంసం ఊహించలేనిది. ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా పదుల సంఖ్యలో క్షతగాత్రులుగా మారిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు జరిగినపుడు ప్రాణనష్టం జరగకుండా ప్రమాద తీవ్రత అతి తక్కువగా ఉండే విధంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఇండేన్ గ్యాస్ విభాగం సరికొత్త టెక్నాలజీతో కాంపోజిట్ సిలిండర్లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. ఐదు, పది కేజీల్లో లభించే ఈ సిలిండర్లు ఆధునిక టెక్నాలజీతో తయారు చేయడమే కాకుండా ప్రస్తుతం వాడే ఉక్కు సిలిండర్ల బరువులో సగానికి కన్నా తక్కువగా ఉండడం వీటి ప్రత్యేకత.

ఏమిటీ ఈ కాంపోజిట్ సిలిండర్లు

ప్రస్తుతం ఇంటి అవసరాలకు వాడే సిలిండర్లను ఉక్కుతో తయారు చేస్తుంటారు. ప్రమాదంలో ఇవి పేలితే ఆస్తి, ప్రాణ నష్టాలు అధికంగా ఉంటున్నాయి. వీటిని నివారించడానికి మూడు పొరలతో కూడిన సిలిండర్లను రూపొందించారు. వీటినే కాంపోజిట్ సిలిండర్లు అని పిలుస్తున్నారు. లోపలి పొరను బ్లో–మోల్డెడ్ హై–డెన్సిటీ పాలిథిలిన్ (హెచ్‌డీపీఈ) తయారు చేస్తారు. దీనిపైన ఫైబర్ గ్లాస్‌తో కూడిన రెండవ పొరను ఏర్పాటు చేశారు. వీటిని కప్పుతూ మూడవ పొరగా హెచ్‌డీపీఈతో తయారు చేసిన జాకెట్ ఉంటుంది. ప్రస్తుతం వాడే ఉక్కు సిలిండర్ల బరువులో సగానికి కన్నా తక్కువగా ఉండడంతో పాటు ప్రమాద తీవ్రత ఉక్కు సిలిండర్లతో పోల్చితే 80నుంచి 90 శాతం తక్కువగా ఉంటుందని కంపెనీ స్పష్టం చేస్తోంది.



ప్రమాదరహిత కాంపోజిట్ గ్యాస్ సిలిండర్లు

ప్రత్యేకతలు ఏమిటంటే...

అనుకోని సంఘటనలు జరిగినపుడు ప్రమాదాల తీవ్రతను 80నుంచి 90శాతం వరకు తగ్గించడంతో పాటు ఈ కాంపోజిట్ సిలిండర్లు అనేక ప్రత్యేకతలను కలిగి ఉన్నాయి. ఇవి పారదర్శకంగా ఉండడంతో సిలిండర్ లోపల ఎంత గ్యాస్ ఉంది, ఎంత అయిపోయింది తెలుసుకోవచ్చు. ఇవి తుప్పు పట్టవు ఇంటి లోపల మరకలు కావు. బరువు తక్కువగా ఉండడంతో ఒక చోటి నుంచి మరో చోటికి సులువుగా తీసుకుపోవచ్చు. ప్రస్తుతం ఇండేన్ గ్యాస్ డీలర్ల వద్ద ఈ సిలిండర్లు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం ఇంటి అవసరాలకు వాడే సిలిండర్లో గ్యాస్ 14.2 కిలోలు ఉండగా కాంపోజిట్ సిలిండర్లలో 10 కేజీలు, 5 కేజీల పరిణామంలో లభ్యమవుతాయి. వీటిని కావాలంటే సెక్యూరిటీ డిపాజిట్‌గా 10కేజీల వాటికి 3500, 5కేజీల వాటికి 2200 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉక్కు సిలిండర్లు వాడే వారు డిపాజిట్ వ్యత్యాసాన్ని చెల్లించి ఉక్కు సిలిండర్ల నుంచి కాంపోజిట్ సిలిండర్లకు మారవచ్చు. సాధారణ సిలిండర్ల వలె వీటిని కూడా హోం డెలవరీ చేస్తారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని డీలర్లు అంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



"ప్రస్తుతం వాడే గ్యాస్ సిలిండర్ పేలితే ప్రాణ, ఆస్తినష్టం తీవ్రంగా ఉంటుంది. వాటి స్థానంలో ప్రస్తుతం నూతన టెక్నాలిజీతో తయారు చేసిన కాంపోజిట్ సిలిండర్లను ఉపయోగిస్తే ప్రమాద తీవ్రతను 80 నుంచి 90 శాతం వరకు తగ్గించవచ్చు. వినయోగదారులు ప్రస్తుత ఉక్కు సిలిండర్ల నుంచి కాంపోజిట్ సిలిండర్లకు సులువుగా మారే అవకాశాన్ని కంపెనీ కల్పించింది. విని యోగదారులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలి.

– కారింగుల అంజన్‌గౌడ్, ఇండేన్‌గ్యాస్ డీలర్, కోదాడ

'వశిష్ట'ను డీటీసీపీకి మించి అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: వశిష్ట డ్రీమ్ సిటీ వెంచర్‌ను డీటీసీపీకి మించి అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామంలో వశిష్ట డ్రీమ్ సిటీ బ్రోచర్‌ను నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సామాన్య ప్రజలకు ప్లాట్ల ధరలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిర్యాలగూడ రానున్న కాలంలో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ ద్వారా పది వేల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఇలాంటి వెంచర్లు మిర్యాలగూడలో మరిన్ని రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వింజం రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ వెంకన్న, సర్పంచ్ పద్మనాగార్జున, వెంచర్ భాగస్వాములు బండారు ప్రసాద్, కొండూరు శంకర్, కర్నాటి విష్ణు, రావిరాల వెంకట్, ఇటుకల కేశవ్, ఆమంచి రామలింగం, బొడ్డుపల్లి సతీష్, రేగట్టె నారాయణరెడ్డి, సతీష్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వశిష్ట డ్రీమ్ సిటీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య

● రెడ్డిగూడెంలో విషాదం



హైదరాబాద్‌లోని కుషాయిగూడలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో భార్యా, కుమారుడితో సహా సజీవ దహనమైన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం రెడ్డిగూడేనికి చెందిన నరేష్ ఇంటి వద్ద రోదిస్తున్న బంధువులు, గ్రామస్తులు

స్థల వివాదం.. ముగ్గురిపై పలువురి దాడి

చౌటుప్పల్ : ప్లాట్ పంచాయితీలో ఓ సామాజిక వర్గానికి చెందిన పలువురు మారణాయుధాలతో ముగ్గురిపై దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటన మండల పరిధిలోని తూప్రాన్‌పేటలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సీత పాండు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ గ్రామానికి చెందిన గందం రాజుకు మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామంలోని సర్వే నంబర్ 29లో 800గజాల స్థలం ఉంది. మూడేళ్లలో నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో తనస్థలం తిరిగి తీసుకుంటానన్న షరతుతో 2017లో మున్నూరు కాపు సంఘానికి గిఫ్ట్‌డీడ్ చేశాడు. అయితే, గడువులోపు ఎలాంటి నిర్మాణం చేపట్టకపోవడంతో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన తుప్పా భరత్‌కుమార్‌కు రాజు ఇటీవల ఆ ప్లాటును విక్రయించాడు. భరత్‌కుమార్ తన స్థలంలో ఈనెల 13న నిర్మాణ పనులు చేపట్టడంతో మున్నూరుకాపు సంఘం నాయకులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆరోజు ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించారు. ఆదివారం మరోసారి పనులు ప్రారంభించగా విషయం తెలుసుకున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు చక్రం జంగయ్య, వర్కారి రాము, గందం సత్తయ్య, చక్రం రవీందర్, పగడాల పాండు, పగడాల యాదయ్య, వర్కారి రాజు, గందం అంజనేయులు, పరిధం సురేష్‌లతోపాటు మరికొందరు వ్యక్తులు అక్కడకు చేరుకున్నారు. అక్కడే ఉన్న గందం రాజు, భరత్‌కుమార్‌లపై రాళ్లు, కర్రలు, ఇనుపరాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను వీడియో చిత్రీకరిస్తున్న వర్కారి గణేష్ అనే వ్యక్తిని కూడా గాయపరిచారు. అతడి సెల్‌ఫోన్ ధ్వంసం చేశారు. దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు గందం రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. దాడిలో పాల్గొన్న మరికొందరిని గుర్తించాల్సి ఉందన్నారు.



దాడి చేస్తున్న మున్నూరుకాపు సంఘ సభ్యులు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మిర్యాలగూడ అర్బన్: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన పట్టణంలోని సీతారాంపురంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురంలో నివాసముంటున్న జమీలాబేగం ఇంట్లో శనివారం రాత్రి సార్ట్ సర్క్యూట్ జరిగి సామగ్రికి మంటలు అంటుకున్నాయి. గమనించిన కుటుంబ సభ్యులు ఇంటినుంచి బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. మంటలు ఇంటిని చుట్టిముట్టి వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. స్థానికుల సహాయంతో మంటలను అదుపుచేసిన అనంతరం అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.10వేల రూపాయలను అందించారు. ప్రభుత్వం తరుపున ఆదకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, నాయకులు పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ సలీం, షేక్ మదార్ బాబా, ఇంజం రాజేంద్రప్రసాద్, ఇమ్రాన్ తదితరులున్నారు.



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తదితరులు

అర్ధరాత్రి ఇంట్లో అగ్ని ప్రమాదం

సూర్యాపేట క్రైం : పట్టణంలోని విద్యానగర్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్‌తో ఏసీకి మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోగా బెడ్ రూమ్‌లోని మంచాలు, పరుపులు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఇంటి యజమాని కృష్ణ ఒక్కడే ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఏసీ నుంచి మంటలు వస్తుండడాన్ని గమనించి బెడ్ రూమ్ నుంచి బయటపడడంతో ప్రాణాలను దక్కించుకున్నాడు. తాను బయటికి వచ్చాక మంటలతో మంచం పరుపులు దగ్ధమయ్యాయని తెలిపారు. పక్కింటి వారిని అప్రమత్తం చేయడంతో పైపుల ద్వారా నీళ్లు చల్లినా మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి అదుపు చేశారు. విద్యుత్ సిబ్బంది ఇంటికి పవర్ సప్లయ్ బంద్ చేయడంతో ప్రమాదం తప్పింది.

తాస్కానిగూడెం గ్రామస్తుల ఆందోళన విరమణ



బాలిక ఇంటి ఎదుట శివ మృతదేహం

చండూరు : చండూరు మండలం తాస్కానిగూడేనికి చెందిన అబ్బనబోయిన శివ (26) ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు, గూడెం వాసులు మృతదేహంతో అదే గ్రామానికి చెందిన మైనర్ ఇంటి ఎదుట చేపట్టిన ఆందోళనను ఆదివారం రాత్రి విరమించారు. శివ ఇదే గ్రామానికి చెందిన ఓ మైనర్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ప్రేమ వ్యవహారంలో మైనర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై పోలీసులు విచారణ జరపకుండానే శివ ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి బంధువులు ఆరోపించారు. కారకులపై చర్యలు తీసుకోవాలని శనివారం రాత్రి నుంచి ఆందోళన కొనసాగించారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే, మృతుడి కుటుంబాలతో పోలీసులు చర్చలు జరిపి బాధ్యులపై విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. సోమవారం శివ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం



గీతారాణి (ఫైల్)

కొండమల్లేపల్లి : ఉరేసుకుని ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ఆదివారం రాత్రి కొండమల్లేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నాంపల్లి మండలం పావనోనిపల్లి గ్రామానికి చెందిన కడారి గీతారాణి, గిరి దంపతులు ఆరేళ్ల క్రితం కొండమల్లేపల్లికి వచ్చి స్థిరపడ్డారు. భర్త గిరి స్థానిక విద్యుత్ కార్యాలయంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఆదివారం ఉదయం గీతారాణి వేరుశనగ కూలీకి వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చింది. గిరి విధులకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో గీతారాణి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన అత్త తలుపులు కొట్టినప్పటికీ తెరవకపోవడంతో అనుమానంతో కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సహాయంతో తలుపులు పగలగొట్టగా అప్పటికే గీతారాణి మృతి చెంది ఉంది. కాగా, గీతారాణి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

కంపచెట్లలో చిక్కుకున్న వృద్ధుడు.. రక్షించిన పోలీసులు

దేవరకొండ : కంపచెట్ల నడుమ చిక్కుకొని బయటికి రాలేక బిక్కుబిక్కుమంటున్న ఓ వృద్ధుడిని దేవరకొండ పోలీసులు స్థానిక యువకుల సహాయంతో రక్షించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుగొమ్ము మండలానికి చెందిన కూరాకుల ముత్తయ్య పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.ముత్తయ్య భార్య గతేడాది మృతిచెందింది.దీంతో ఇంటి సమీపంలోనే ఉంటున్న ముత్తయ్య తమ్ముడు అతని బాగోగులు చూస్తున్నాడు. కాగా, రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ముత్తయ్య ఆదివారం పట్టణ శివారులోని గాజీనగర్‌కు వెళ్లే మార్గంలో గల కంపచెట్లలో చిక్కుకొని బయటికి రాలేక తీవ్ర అవస్థపడ్డాడు. ఇది గమనించిన స్థానిక యువకులు ఇలియాస్,జానిలు దేవరకొండ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న బ్లూకోట్స్ సిబ్బంది శ్రీధర్, బాలాజీలు జేసీబీ సహాయంతో కంపచెట్లను తొలగించి ముత్తయ్యను వెలికితీశారు. మాట్లాడలేకపోతున్న అతడిని 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్య చికిత్స అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు దేవరకొండ ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ముత్తయ్య బహిర్భూమికి వెళ్లి కళ్లు సరిగా కనిపించక కంపచెట్లలో చిక్కుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.



ముత్తయ్యను వాహనంలో తరలిస్తున్న 108 సిబ్బంది

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం దామరచర్ల మండలం బాండావత్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గేరితండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆడావత్ పాశ్య (58) తన ఇంటి ఆవరణలో ఉన్న ఇనుప దండెం తీగకు బట్టలు ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పాశ్యను చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రమణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలు ఆదివారం భువనగిరిలో వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రాంనగర్‌లో అద్దెకు నివాసం ఉంటున్న పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో సుమారు రూ. 5 నుంచి రూ. 10 వేల వరకు, ఎల్‌బీనగర్‌లోని రాఘుల రవి ఇంట్లో బంగారంతో పాటు నగదును కలుపుకుని సుమారు రూ.5 లక్షల వరకు దుండగులు శనివారం అపహరించుకుపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాన్‌డబ్బాలో..

మాడుగులపల్లి: మండల కేంద్రంలోని ఓ పాన్‌డబ్బాలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 15 వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లు, పాన్ మసాలా సామగ్రి, రూ.3 వేల నగదు అపహరణకు గురైనట్లు సమాచారం. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు. కాగా ఇటీవల మండల కేంద్రంలో చోరీలు పెరిగాయని స్థానికులు అంటున్నారు. రాత్రివేళ పోలీస్ పెట్రోలింగ్ కరువైందని ఆరోపిస్తున్నారు.

వేసవిలో లాభసాటిగా ఆకుకూరల సాగు

- కోదాడ డివిజన్ ఉద్యానశాఖ అధికారి అనిత

పాడి పంట

నడిగూడెం : ఆకు కూరలు సమీకృత పోషకాహారంలో చాలా ముఖ్యమైనవి. వీటిలో శరీరానికి అవసరమైన ఎన్నో పోషక పదార్థాలు మనకు లభిస్తాయి. రోజు ప్రతి ఒక్కరూ 125 గ్రాముల ఆకు కూరలను ఆహారంలో తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కోదాడ డివిజన్ ఉద్యానశాఖ అధికారి అనిత చెబుతున్నారు. అయితే ఆకు కూరల సాగులో రైతులకు ఇచ్చే సలహాలు, సూచనలు ఆమె మాటల్లోనే .. వేసవిలో అధిక ఉష్ణోగ్రత ఉంటుంది. కొద్దిపాటి మెళకువలు పాటిస్తే ఆకు కూరల సాగుతో అధిక లాభాలు పొందవచ్చు. వేసవిలో తేమ నిలుపు కోగలిగిన బరువైన నల్లభూములు అనుకూలంగా ఉంటాయి. నీటి వసతి ఉంటే ఎర్రనేలలు, ఇసుక నేలలు ఎంపిక చేసుకోవాలి. ఆకు కూర మడులకు తుంపర్ల పద్ధతిలో నీటిని అందించాలి. నీటి సమర్థ వినియోగంతో పాటు ఆకుకూరల మడులను ఎండ తీవ్రత నుంచి కాపాడవచ్చు.

రకాలు : ముఖ్యంగా వేసవి సాగుకు సూచించిన రకాలను ఎంపిక చేసుకుంటే అవి నీటి ఎద్దడిని తట్టుకొని మంచి దిగుబడినిస్తాయి. వేసవి సాగుకు తోటకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, గోంగూర, అనువైనవి.

తోటకూరలో : ఆర్.ఎస్.ఎ-1, అర్కాసుగుణ, పూసాకీర్తి, అర్కాఅరుణ, ఎరుపు

పాలకూరలో : ఆల్‌గ్రీన్, పూసా జ్యోతి, పూసాపాలక్,

మెంతికూర : పూసా ఎర్లీబంచింగ్, లాంసెలక్షన్-1



నడిగూడెం మండలం కరివిరాలలో సాగులో ఉన్న పాలకూర

కొత్తిమీర: సాధన, స్వాతి

గోంగూరలో : ఆంగ్రో-12, లోకల్, ఎర్ర గోంగూర రకాలను ఎంపిక చేసుకోవచ్చు.

విత్తడం

తోటకూర : 900-1000 గ్రాముల విత్తనం 10 కిలోల ఇసుకతో కలిపి ఒత్తుగా చల్లాలి. ఎకరాకు 20 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. కోత, కత్తిరింపు తర్వాత ఎకరాకు 10కిలోల నత్రజని అందించే ఎరువును వేసి నీరుపెట్టాలి.

పాలకూర : ఎకరాకు 12-15 కిలోల విత్తనం, వరుస వరుసకు 12సెం.మీ, మొక్కకు మొక్కకు మధ్య 10 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. ఎకరాకు 10కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి.

మెంతికూర : ఇసుక, మురుగు నీటి వసతి ఉన్న ఒండ్రు నేలల్లో పండించేందుకు అనుకూలం. 10-12 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనాన్ని వెదజల్లవచ్చు, లేదా వరుసలలో నాటవచ్చు. విత్తే ముందు విత్తనాన్ని నీటిలో నానబెట్టి వెదజల్లవచ్చు. ఎకరాకు 10కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి.

కొత్తిమీర : మురుగు నీటి సౌకర్యం కలిగిన బంకనేలలు అనుకూలం. విత్తే ముందు గింజలను రెండు బద్దలుగా చేయాలి. విత్తనాన్ని వెదజల్లడం లేదా వరుసలలో వేయాలి. ఎకరాకు 5-6 కలోల విత్తనాన్ని 15 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. ఎకరాకు 4కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేయాలి.

ఎరువుల యాజమాన్యం

బాగా దుక్కి చేసిన నేలలో ఆఖరి దుక్కిలో ఎకరాకు 10-15 టన్నుల పశువుల ఎరువు 200 కిలోల వేప పిండి వేసి కలియదున్నాలి. వీలేనంత ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వాటితో పాటు జీవన ఎరువులు వాడితే మంచి ఫలితం ఉంటుంది. సేంద్రియ ఎరువుల వాడకం వలన నేల గుల్లబారి ఎక్కువ రోజులు తేమ నిల్వ ఉంటుంది. రెండు వరుసల మధ్య వరిగడ్డి, వేరుశనగ పొట్టు ఎండుటాకులు పరిస్తే నేలలో తేమ సంరక్షించబడును. ఆకు దిగుబడి పెంచడానికి 2శాతం యూరియా (20 గ్రాములు లీటరు నీటికి) జిబ్బరెల్లిక్ ఆమ్లం 50 మి.గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది.

సస్యరక్షణ చర్యలు

ఆకుకూరలను కూరగా వాడతారు కనుక వీలైనంత వరకు పురుగు మందులను వాడకపోవడమే మంచిది. వేప సంబంధిత పురుగు మందులను మాత్రమే వాడాలి. ముఖ్యంగా రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు పురుగుల నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి కార్బెండాజిమ్ 1 గ్రాము లేదా మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

గోంగూర : ఎకరాకు 6-8 కిలోల విత్తనాన్ని 60 సెం.మీ. ఎడంగా తయారు చేసుకున్న బోదెలో 30 సెం.మీ. దూరంలో వరుసలో విత్తుకోవాలి. ఎకరాకు 6కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేసుకోవాలి.

నీటి యాజమాన్యం

ఆకుకూరలు విత్తిన వెంటనే నీరు పెట్టాలి. మళ్లీ మూడో రోజు నీరు పెట్టి నేల స్వభావాన్ని బట్టి తేలిక నేలలో 5-6 రోజుల వ్యవధిలో, బరువు నేలలో 8-10 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి. తోటకూర విత్తిన తర్వాత నెమ్మదిగా నీటిని పారించాలి. లేకపోతే నీటితో విత్తనం కొట్టుకపోయి మొలకశాతం తగ్గుతుంది. ఆకు కూరల్లో దిగుబడి ముఖ్యంగా వేసవిలో నీటి యాజమాన్యంపైనే ఆధారపడి ఉంటుంది. ప్రతి కోత తర్వాత పైపాటు ఎరువులు చల్లి నీరు పెట్టాలి.

కలుపు నివారణ : అన్ని ఆకుకూరల పంటల్లో కలుపు నివారణకు పెండిమిథాలిన్ ఎకరాకు 1.2 లీటర్ల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 14 గంటల్లో పిచికారీ చేసి, 30 రోజుల వరకు కలుపు నివారించవచ్చు.